క్లుప్తంగా

విద్యార్థులకు భగవద్గీత బోధనలు



భగవద్గీత పుస్తకాలతో విద్యార్థులు

పుత్తూరు: పట్టణంలోని గీతా సేవా సమాజం వారు వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులకు భగవద్గీత బోధనల ద్వారా హైందవ ధర్మంపై అవగాహన కల్పించామని ప్రవచన కర్త మురళీకృష్ణ తెలిపారు. స్థానిక గీతా మందిరంలో నెల రోజులపాటు జరిగిన అవగాహన కార్యక్రమం ముగింపు సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు 15వ అధ్యాయం పురుషోత్తమ ప్రాప్తిపై అవగాహన కల్పించామని తెలిపారు. తరగతులకు హాజరైన 30 మంది విద్యార్థులకు ఉచితంగా భగవద్గీత పుస్తకాలను అందించామన్నారు. నాలుగు దశాబ్దాలుగా గీతా సేవా సమాజం ఆధ్వర్యంలో గీతా వ్యాప్తి కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు లోకేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

నింద్ర: తిరుపతి కేవీకే ఆధ్వర్యంలో మండలంలోని కావునూరు, నింద్ర, పాదిరి గ్రామాల్లో రాస్ కృషి విజ్ఞాన కేంద్రంవారు అవగాహన సదస్సులు నిర్వహించారు. శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ మేలైన యాజమాన్యం పద్ధతులు, భూసార పరీక్ష ప్రాముఖ్యత, డ్రోన్‌ల వినియోగం మొదలైన అంశాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాఘవేంద్ర, పశువైద్యాధికారి సాయిసౌందర్య, పశు వైద్య శాస్త్రవేత్త అనూష, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యూత్ కార్యదర్శికి సన్మానం



గాంధీని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వడమాలపేట (విజయపురం): వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కార్యదర్శి గాంధీని ఆ పార్టీ నాయకులు శనివారం ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన పదవికి న్యాయం చేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఉమాపతి, మునిబాబు, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

వైస్ ఎంపీపీకి పరామర్శ



వైస్ ఎంపీపీని పరామర్శిస్తున్న నాయకులు

విజయపురం: మండల వైస్ ఎంపీపీ బాలాజీ కుటుంబ సభ్యులను శనివారం పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. రెండు రోజుల క్రితం ఆయన తల్లి వనజమ్మ మృతి చెందారు. ఈ సందర్భంగా నగరి నియోజకవర్గంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీలకు జైభీమ్ అండ

కార్వేటినగరం: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు జై భీమ్ ఫౌండేషన్ అండగా నిలుస్తోందని ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హిందూ–ముస్లిం కళ్యాణ మండపంలో జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన పేదవారు ఎక్కడ ఉన్న సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం జై భీమ్ అడ్వైజర్, విశ్రాంత ఉపాధ్యాయుడు పి.గుర్రప్ప మాట్లాడుతూ జై భీమ్ ఆధ్వర్యంలో మార్చి నెలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దౌర్జన్యాలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ నరేష్, ట్రెజరర్ అనిల్‌కుమార్, సభ్యులు వెంకటేష్, రాజ్‌కుమార్, ప్రవీణ్, పరంధాం, కిరణ్, బొబ్బిలి, ప్రశాంత్, వేణు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం కల్లూరు పంచాయతీలో అధికార పార్టీ నాయకులు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గత మూడు రోజులుగా ఏపీఐఐసీ భూముల నుంచి గ్రావెల్ తరలిస్తున్నారని, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. స్థానికంగా కొందరు అధికార పార్టీ నాయకులు భూ కబ్జా చేసుకొని ఉన్నారు. వాటికి అవసరమైన మట్టిని ఏపీఐఐసీ భూముల నుంచి తీసుకెళుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, రెవెన్యూ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు ఇచ్చే మామూళ్లు తీసుకొని అక్రమ గ్రావెల్ తరలింపునకు సిబ్బంది సహకరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు అక్రమ గ్రావెల్ తరలింపుపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిరీక్షణ.. నిట్టూర్పులే మిగిలాయి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి ప్రభుత్వం ద్వారా అందించే సేవలను నేరుగా ఇంటి వద్దకే చేర్చేవారు. ఏది కావాలన్నా గ్రామ సచివాలయ సిబ్బంది, వార్డు, గ్రామ వలంటీర్ల ద్వారా అన్ని రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కింది. ప్రజలకు అందించే ఎలాంటి సేవలైనా, పనులైనా అది ప్రభుత్వ బాధ్యత... ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాలు పారదర్శకంగా ఉండాలి.. ఏపని అయినా చిత్త శుద్ధితో చేయాలి అన్న సంకల్పంతో గడప వద్దకే పరిపాలనను అందించి సులభతరం చేశారు. అయితే ప్రస్తుతం ఏ సర్టిఫికెట్ కావాలన్నా గంటల తరబడి ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. అధికారుల కోసం పడిగాపులు కాస్తున్నారు. అధికారులు ఉన్నా సకాలంలో సర్టిఫికెట్లు మంజూరు కాక నానా తిప్పలు పడుతున్నారు. – వెదురుకుప్పం

- ప్రభుత్వ సేవల కోసం సామాన్యుడి ఆరాటం
- గతంలో జగనన్న సురక్ష ద్వారా ఇంటి వద్దకే సర్టిఫికెట్లు
- ప్రస్తుతం సకాలంలో జారీ కాక వేశారిపోతున్నారు



జగనన్న సురక్ష ద్వారా సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు(ఫైల్)

జగనన్న సురక్ష

గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్టిఫికెట్ల జారీలో జగనన్న సురక్ష ద్వారా ధ్రువీకరణ పత్రాలను నేరుగా ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చేలా వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ప్రజలకు ఏ సర్టిఫికెట్ కావాలన్నా నేరుగా ఆయా గ్రామ వలంటీర్లను సంప్రదిస్తే చాలు వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అదనపు ఖర్చులు లేకుండా తెచ్చి ఇచ్చేవారు. సర్టిఫికెట్ల మంజూరులో ఎలాంటి జాప్యం జరిగేది కాదు. ఏదో కారణం చూపి అధికారులు సైతం తప్పించుకునేందుకు అవకాశం లేకుండా చేసేవారు. నెలలు, ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా మంజూరు కాని ధ్రువీకరణ పత్రాలు సైతం జగనన్న సురక్ష ద్వారా కచ్చితంగా అందించేవారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఇలాంటి సేవలకు చెక్ పెట్టి ప్రజలను తిప్పలపాలు చేస్తోంది. పదుల కిలోమీటర్లు వెళ్లి కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. చివరకు అధికారులు సకాలంలో స్పందించక ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా పలుకుబడి ఉన్న వాడిదే ప్రభుత్వ కార్యాలయ వద్ద పెత్తనం అధికమైనట్లు జనం అంటున్నారు. సామాన్య ప్రజలకు కార్యాలయాల్లో అధికారులు విలువ ఇవ్వడం లేదని వాపోతున్నారు. ప్రధానంగా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల జారీలో జగనన్న సురక్ష అనే నూతన విధానాన్ని ప్రవేశ పెట్టి గంటల వ్యవధిలో తాము కోరుకున్న, అవసరమైన సర్టిఫికెట్లను అందించే వారు. ఇంటి వద్దకే అందించే సేవలను పక్కన పెట్టి ఇప్పుడు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లి నానా అవస్థలు పడుతున్నట్లు ప్రజలు చెప్తున్నారు. అప్పట్లో గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి ధ్రువ పత్రాలు ఇచ్చేవారని అంటున్నారు.

సకాలంలో ఇవ్వడం లేదు

ఏదైనా ధ్రువీకరణ పత్రం పొందాలంటే ప్రజలకు అది పెద్ద సమస్యగా పరిణమిస్తోంది. అధికారులు చుట్టూ తిరిగినా కార్యాలయాల వద్ద పడిగాపులు కాసినా సకాలంలో అవి మంజూరు కాక విసిగి వేశారిపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఎప్పుడు ఉంటారో.. కార్యాలయాలకు ఎప్పుడు వస్తారో తెలియక తికమకపడుతున్నారు. అధికారులు ఉన్నప్పటికీ సాధారణ ప్రజలంటే అసూయతో వ్యవహరిస్తున్నారని మండి పడుతున్నారు. ప్రజలకు అందించే ఇలాంటి సేవలపై కూడా రాజకీయ ముద్ర వేస్తున్నట్లు పలువురు అంటున్నారు. ప్రధానంగా కుల, ఆదాయ, నివాస, రెవెన్యూపరమైన ధ్రువపత్రాలు, జనన, మరణ, వివాహ తదితర ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న క్రమంలో ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా అధికారులకు చేయి తడపందే ఫైలు కదిలే ప్రసక్తే ఉండదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే...



ఏ సర్టిఫికెట్ పొందాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదు. అయితే గత ప్రభుత్వంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలను తెచ్చి ఇచ్చే వారు. అంతకు ముందు 15 రోజులు పట్టేది. జగనన్న ముఖ్యమంత్రి ఉన్నన్ని రోజులు సేవలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు మళ్లీ అవస్థలు తప్పడం లేదు.

– లోకేశ్వరి, శ్రీకావేరిరాజపురం

పడిగాపులు కాస్తున్నాం...



గతంలో సర్టిఫికెట్లు పొందాలంటే జగనన్న సురక్ష ద్వారా ఒకటి, రెండు రోజుల్లో ధ్రువీకరణ పత్రాలు పొందే వాళ్లం. అయితే నేడు కూటమి ప్రభుత్వంలో వారం, నెలలు పడుతోంది. అధికారులు అందుబాటులో ఉండడం లేదు. ఉన్నా సకాలంలో సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. అయినా మమూళ్లు ఇవ్వందే ఫైల్‌ను తాకడం లేదు. సామాన్యులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు అవలంభిస్తున్న తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

– టి.ఆనందరావు, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం మండలం

అప్పట్లో వెంటనే మంజూరు చేశారు



గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ఒక్క రోజులోనే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేశారు. జగనన్న సురక్ష పథకం కింద ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అందుకున్నాను. ప్రజలకు ఏది అవసరమో దాన్ని గుర్తించి ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చేవారు. నేడు దరఖాస్తు చేసుకుని వారం రోజులు గడుస్తున్నా ఇంత వరకే లేదు. మామూళ్లు ఇవ్వాల్సి వస్తోంది. – చలపతి, పాదిరికుప్పం, కార్వేటినగరం మండలం

ఖర్చు లేకుండా ...



రెండేళ్ల క్రితం అవసర నిమిత్తం ఓ కార్యాలయానికి సమర్పించేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం వచ్చింది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. ప్రస్తుతం అవే సర్టిఫికెట్లు పొందాలంటే నానా తిప్పలు పడాల్సి వస్తోంది. దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

– దినకరన్,సత్రవాడ, నగరి మండలం

ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చారు



మా ఇంటి వద్దకు వచ్చి మాజీ మంత్రి రోజా చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను తెచ్చి ఇచ్చారు. అప్పటి మంత్రి చేతుల మీదుగా ఇంటి వద్దనే తీసుకోవడం మరచిపోలేని అనుభూతి. జగనన్న సురక్ష పథకం పేరిట ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అందించడం సామాన్యులకు వరం. ఏది అవసరమైనా అధికారుల ద్వారా గుర్తించి ఇంటి వద్దకు సేవలందించే రోజులు గత ప్రభుత్వానిది. అయితే ప్రస్తుతం పాత రోజులు చూడాల్సి వస్తోంది. నేడు ఏదైనా పొందాలంటే వ్యయప్రయాసలకు కోర్చాల్సి వస్తోంది. ప్రస్తుతం ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

– హైందవి, పుత్తూరు

తూకాల్లో తేడాలొస్తే డీలర్లపై చర్యలు



తిరుమలరాజుపురం రేషన్ షాపుల్లో స్టాక్ పరిశీలిస్తున్న రిషివర్మా, దేవి

పాలసముద్రం: మండలంలో తెల్లరేషన్ కార్డులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసరాల తూకాల్లో తేడాలొస్తే సంబంధిత డీలరుపై చర్యలు తప్పదని డిప్యూటీ తహసీల్దార్ రిషి వర్మా, ఏఆర్ఐ దేవి తెలిపారు. శనివారం తిరుమలరాజుపురం, నరసింహపురం, గంగమాంబపురం పంచాయతీల్లోని చౌక దుకాణాలను వారు క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. డీలర్లతో వారు మాట్లాడుతూ చౌక దుకాణం ఎదుట తప్పకుండా నిత్యావసర ధరల పట్టిక బోర్డు, తాగునీటి సౌకర్యం తప్పక ఉండాలని హెచ్చరించారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ సరుకులు అందించాల్సిన బాధ్యత కూడా డీలర్లపై ఉందన్నారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు డీలర్లు రేషన్ షాపుల్లో ఉండాలని తెలిపారు.

ఘనంగా చిత్ర పౌర్ణమి పూజలు



కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

నగరి: స్థానిక ఓం శక్తి ఆలయంలో చిత్ర పౌర్ణమి సందర్భంగా విశేష దీపాలంకరణ, కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. ఎరుపు దుస్తులు ధరించిన 108 మహిళా భక్తులు దీప పూజల్లో పాల్గొని పసుపుతో అమ్మవారిని చేసి 1008 పుష్పార్చన, వేపాకు అర్చన, కుంకుమ, పసుపుతో అర్చనలు చేపట్టారు. పరిసర ప్రాంత భక్తులందరూ అర్చన నైవేద్య కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని సేవించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఉభయదారులకు ఆలయ మర్యాదలు చేశారు. భక్తులకు పసుపు దారం, విభూది, కుంకుమ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉభయదారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు వాడకానికి గుడ్‌బై చెప్పండి



నగరిలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐ, వైద్యసిబ్బంది

– డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్

నగరి: పొగాకు వాడకానికి గుడ్‌బై చెప్పండి, మీ జీవితాన్ని రక్షించుకోండి అని డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వైద్యసిబ్బందితోపాటు నగరి పట్టణం ఓంశక్తి ఆలయం నుండి టవర్‌క్లాక్ సెంటర్ వరకు పొగాగు వాడకంతో జరిగే ప్రమాదాలపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనాన్ని పొగాకు ఎలా హరిస్తోందని తెలియజేసి, భవిష్యత్తు తరాలను పొగాకు బారినుండి కాపాడడమే ఈ దినోత్సవ లక్ష్యం అన్నారు. 1987 నుంచి ప్రపంచ ఆరోగ్య సంస్థ పొగాకు రహిత ప్రపంచం కోసం ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 13–15 సంవత్సరాల వయస్సు గల 37 మిలియన్ల మంది టీనేజర్లు పొగాకు ఉత్పత్తులకు బానిసలవుతున్నారని పేర్కొన్నారు. సీఐ విక్రమ్ మాట్లాడుతూ కేవలం బాల్యాన్నే కాదు, పెద్దల ఆరోగ్యాన్ని పొగాకు ఉత్పత్తులు నాశనం చేస్తున్నాయన్నారు. పొగాకులో క్యాన్సర్‌కు కారణమయ్యే పదార్థాలు దాదాపు 70 శాతం వరకూ ఉంటాయన్నారు. ప్రజల ప్రాణాలను పొగాకు పీల్చేయకూడదంటే దీనిపై ఇతరుల్లోనూ అవగాహన పెంచేందుకు కృషి చేయాలన్నారు. పొగాకు సేవించే వారితోపాటు కలిసి జీవించే వారి ప్రాణాలూ ప్రమాదంలో పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నింద్రలో..



నింద్రలో వైద్య సిబ్బంది ర్యాలీ

నింద్ర: పొగాకు నిర్మూలనతోనే ఆరోగ్యమైన సమాజాన్ని రూపొందించవచ్చునని మండల వైద్యాధికారులు సుమలత, వినీషా అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు తాగవద్దు–క్యాన్సర్ బారిన పడొద్దనే నినాదాలతో ర్యాలీ సాగించారు. పొగాకుతో జరిగే ప్రమాదాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్‌ఓ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..



పొగాకు నివారణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ, ఎస్ఐ చిన్నరెడ్డప్ప

పాలముసుద్రం: మత్తు పదార్థాలు, పొగ తాగితే ఆరోగ్యానికి హానికరమని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. శనివారం బలిజకండ్రిగలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగ తాగడం, పత్తు పదార్థాలు తీసుకోవడంతో వచ్చే అనర్థాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. పొగాకు ఉత్పత్తులు వినియోగించకూడదని తెలిపారు. పర్యావరణాన్ని పొగాకు ఉత్పత్తుల వినియోగం నుండి రక్షించేందుకు ప్రయత్నిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న తహశీల్దార్ జరీనా

వడమాలపేట (విజయపురం): రేషన్ డీలర్లు కచ్చితంగా సమయపాలన పాటించాలని తహశీల్దార్ జరీనా అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ పంపిణీపై డీలర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నేటి నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు తప్పనిసరిగా కార్డుదారులకు రేషన్ అందించాలన్నారు. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారి ఇండ్ల వద్దకు వెళ్లి రేషన్ అందించాలన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు పరామర్శ



వైఎస్సార్ సీపీ నాయకులను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: మండలంలోని వి.వి.పురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డిశంబ రెశెట్టి అనారోగ్యంతో బాధపడుతుండడంతో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. పెద్దకొండేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దాము ఆచారి రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు అన్ని వేళల్లో అండగా ఉంటానని అన్నారు. జూన్ 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమాల్లోసర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీపీ సరిత, మండల కన్వీనర్ మణి, జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయబాబు, కుప్పయ్య, యువ నాయకుడు శ్యామ్, నాయకులు హరిరెడ్డి, గోవిందరెడ్డి, సుధ, కోటిరెడ్డిబాబు, దామునాయుడు, మణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగిని తొలగింపు అన్యాయం

- దద్దరిల్లిన కౌన్సిల్ సమావేశం
- పద్దెనిమిదేళ్ల సర్వీసుకు మీరిచ్చే మర్యాద ఇదా?
- రాజకీయ కక్ష సాధింపులకు చిరుద్యోగిని బలి చేస్తారా?
- కనీసం మహిళ అన్న మానవత్వం లేదా?
- రికార్డు అసిస్టెంట్ జయంతి తొలగింపుపై.. కమిషనర్‌ను నిలదీసిన పాలక పక్షం





ఉద్యోగిని తొలగింపుపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ ఏకాంబరం, టీడీపీ ఫ్లోర్ లీడర్‌పై పాలకపక్షం ఎదురు దాడి

పుత్తూరు: కేవలం రూ.15 వేల జీతం కోసం పద్దెనిమిదేళ్లుగా మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగినిగా సేవలందించిన రికార్డు అసిస్టెంట్ కృష్ణజయంతి తొలగింపుపై శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశం దద్దరిల్లింది. సమావేశం ప్రారంభం కాగానే ఎలాంటి తప్పు చేయని మహిళా ఉద్యోగి కృష్ణజయంతి తొలగింపు సరికాదని, వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని 24వ వార్డు కౌన్సిలర్ కె.సి.ఏకాంబరం కమిషనర్‌ను కోరారు. ఈ అంశంపై కమిషనర్ మంజునాథ్‌గౌడ్ తన నిర్ణయాన్ని సమర్థించుకొనే ప్రయత్నం చేయగా చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జయప్రకాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఆర్కే రోజాతో కలిసి తీసుకున్న ఫొటోలను కారణంగా చూపి 18 ఏళ్లుగా సేవలందిస్తున్న చిరుద్యోగిని తొలగించడం అన్యాయం అన్నారు. ఉద్యోగరీత్యా ఎవరైనా ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి పని చేయడం వారి బాధ్యతని, దానికి రాజకీయ రంగు పులిమి కక్ష సాధింపులకు దిగడం సరికాదన్నారు. టీడీపీ హయాంలో ఎంతో మంది ఆర్పీలను నియమించారని, అయితే వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టినా ఏఒక్కరినీ తొలగించలేదని గుర్తు చేశారు. అసలు ఆమెపై ఎవరు ఫిర్యాదు చేశారు, ఎవరు తొలగించమని ఆదేశాలిచ్చారో సమాధానం చెప్పాలని నిలదీశారు. చైర్మన్ హరి మాట్లాడుతూ ఆమెను అసలు ఎందుకు మార్చాల్సి వచ్చింది, ఆమె చేసిన తప్పేమిటి, పాలకవర్గానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎలా నిర్ణయం తీసుకొంటారని ప్రశ్నించారు. ఇలాంటి కక్షసాధింపు రాజకీయాలకు ఆజ్యం పోయవద్దని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, ఇలాంటి ఆనవాయితీలకు తెరతీయవద్దని సూచించారు.

మరో విభాగంలో పని చేయమన్నాం

రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జయంతిపై ఫిర్యాదులు వచ్చాయని, దీంతో నాన్ పీహెచ్ వర్కర్‌గా పని చేయాల్సిందిగా ఆమెను ఆదేశించానని, దానికి ఆమె నిరాకరించారని కమిషనర్ మంజునాథ్‌గౌడ్ ఇచ్చిన సమాధానంపై కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. మీరు చెప్పేదానిలో వాస్తవాలు లేవని, ఆమెను పిలిచి మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని సూచించారు.

టీడీపీ ఫ్లోర్ లీడర్‌పై తిరగబడ్డ పాలకపక్షం

ఒక ఉద్యోగిని గురించి కౌన్సిల్ సభా సమయాన్ని వృథా చేయడం సరికాదంటూ మైకు అందుకొన్న టీడీపీ ఫ్లోర్ లీడర్ జీవరత్నంనాయుడును పాలకపక్ష సభ్యులు తీవ్ర స్థాయిలో అడ్డుకొన్నారు. ఒక మహిళా ఉద్యోగిని రోడ్డుపై పడేసి, ఆమె గురించి మాట్లాడడం సమయం వృథా అనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐదు అంశాలకే కౌన్సిల్ ఆమోదం

- మొత్తం 13 అంశాలతో రూపొందించిన అజెండాలోని 5 అంశాలనే ఆమోదిస్తున్నట్లు చైర్మన్ హరి ప్రకటించారు.
- 10వ వార్డు గోవిందపాళెంలో రూ.90 లక్షలతో సీసీ కల్వర్టు నిర్మాణం, రూ.98 లక్షలతో ఆర్‌సీసీ పైపు లైను పనులు
- రూ.3.85 లక్షలతో మున్సిపల్ కమిషనర్ నిమిత్తం ప్రైవేటు వాహనం ఏర్పాటు
- 2వ వార్డు ఒంటిమిట్ట గ్రామంలో రోజువారీ నీటి సరఫరా నిమిత్తం సబ్‌మెర్సిబుల్ మోటార్, పాత మోటార్ల రీవైండింగ్, ఇతర పనులకు రూ.8.49 లక్షలు మంజూరు.
- పట్టణ పరిధిలోని సర్వే నెంబర్లు 151, 150, 152, 148, 120, 147 వద్ద కాల్వలను సర్వే చేసి, హద్దులు ఏర్పాటు కోసం 300 కూసాల కొనుగోలుకు రూ.2 లక్షలు మంజూరు.
- 23, 24వ వార్డుల్లో సీసీ డ్రైయిన్లు, 2వ వార్డు తిమ్మాపురంలో డ్రైనేజీ సంపు, పుత్తూరు పట్టణంలో వాల్ పెయింటింగ్ కోసం రూ.16.98 లక్షలు మంజూరు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం అప్పలాయిగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల్ సేవలను వైభవంగా నిర్వహించారు. పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామిని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

పుత్తూరు: పరమేశ్వరమంగళం సమీపాన నగరి కనంమిట్ట వద్ద వెలసి ఉన్న దక్షిణ శ్రీకాళీ వారాహి శక్తిపీఠంలో శనివారం పంచమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళీ వారాహి మాతను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ప్రతిరోజూ అన్నదానం నిర్వహిస్తున్నట్లు టెంపుల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి హరి తెలిపారు.